క్లుప్తంగా

ఇంజినీరింగ్ విద్యార్థులకు మెరుగైన ఉపాధి అవకాశాలు

టెక్కలి: ఇంజినీరింగ్ విద్యార్థులకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా శిక్షణ అందజేస్తున్నామని ఏఐ హైదరాబాద్‌కు చెందిన సీఈవో చింత తులసీరావు పేర్కొన్నారు. మంగళవారం టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులకు ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం సాఫ్ట్‌వేర్ రంగంలో ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ ఎంతో అవసరమని వెల్లడించారు. దీనికి తగిన విధంగా వివిధ రకాల కోర్సులను అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా తులసీరావును కళాశాల యాజమాన్య ప్రతినిధులు సన్మానించారు. కళాశాల డైరెక్టర్ వి.వి.నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, ఐటీ హెచ్‌ఓడీ బాలక రమేష్ నాయుడు, సీఎస్‌ఈ హెచ్‌ఓడీ వై.రమేష్ పాల్గొన్నారు.

రేపటి నుంచి సమాఖ్య క్రీడలు

ఇచ్ఛాపురం రూరల్: మండలంలో రెండు రోజుల పాటు పాఠశాల సమైక్య క్రీడలు నిర్వహిస్తున్నట్లు మండల స్పోర్ట్స్ కోఆర్డినేటర్ కృష్ణ పుడియా అన్నారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. 11వ తేదీన లొద్దపుట్టి ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఖోఖో, చెస్, యోగా, 12న ఈదుపురం ఉన్నత పాఠశాలలో వాలీబాల్, కబడ్డీ, బ్యాడ్మింటన్ పోటీలను మండల విద్యాశాఖాధికారి కురమాన అప్పారావు ఆధ్వర్యంలో నిర్వహిస్తామన్నారు. ప్రతిభ గల క్రీడాకారులను ఎంపిక చేస్తామన్నారు.

ప్రధాన రైళ్లను పొడిగించాలి


ఉదయ్‌నాథ్‌కి వినతిపత్రం అందజేస్తున్న సూర్యప్రకాశ్

ఇచ్ఛాపురం: స్థానిక రైల్వేస్టేషన్ మీదుగా నడిచే రెండు ప్రధాన రైళ్లను పొడిగించాలని డీఆర్‌యూసీసీ సభ్యులు, స్థానిక రైల్‌యూజర్ కమిటీ అధ్యక్షులు కట్టా సూర్యప్రకాశ్ రైల్వే అధికారులను కోరారు. మంగళవారం సౌత్‌సెంట్రల్ డిప్యూటీ రైల్వే మేనేజర్ ఉదయ్‌నాథ్‌కొట్లా, సౌత్‌సెంట్రల్ చీఫ్ పాసెంజర్ ట్రాన్స్‌పోర్టు మేనేజర్ బి.రవిచందర్‌లను సికింద్రాబాద్ రైలు నిలయంలో మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా స్థానిక రైల్వేస్టేషన్ గుండా ప్రయాణం చేస్తున్న ప్రధాన రైళ్లు భువనేశ్వర్ నుంచి విశాఖ వరకు నడిచే వందేభారత్‌ను కాకినాడ వరకు, అలాగే విశాఖ ఎక్స్‌ప్రెస్‌ను లింగంపల్లి వరకు పొడిగించాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

కంచిలి: కంచిలి మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశాన్ని బుధవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో వి.తిరుమలరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి ప్రారంభమయ్యే సమావేశం ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి అధ్యక్షతన జరుగుతుందని.. అన్ని శాఖల అధికారులు, సభ్యులు విధిగా హాజరు కావాలని కోరారు.

రోడ్డుకు మరమ్మతులు


గోతులు పూడ్చుతున్న ఆటో డ్రైవర్లు

వజ్రపుకొత్తూరు రూరల్: పూండి–నౌపడ రహదారిలో ఏర్పడిన గుంతలను పూండి గ్రామానికి చెందిన ప్రముఖ వైద్యురాలు లీలా అందించిన ఆర్థిక సాయంతో మంగళవారం మరమ్మతులు చేపట్టారు. ఆటో డ్రైవర్లు రోడ్డు మరమ్మతుల్లో పాల్గొన్నారు.

డీజేలను బహిష్కరిద్దాం

ఇచ్ఛాపురం రూరల్: మనిషి ప్రాణాలకు ముప్పు కలిగించే డీజేలను మనమంతా బహిష్కరిద్దామని మహతీ సాంస్కృతిక కళా సేవా సంస్థ పిలుపునిచ్చింది. మంగళవారం ఈదుపురంలో నిర్వహించిన సమావేశంలో సంస్థ అధ్యక్షుడు జానకీరామ్ మాట్లాడుతూ..ఆధ్యాత్మిక కార్యక్రమాల నుంచి పెళ్లిళ్లు, పండుగల పేరుతో డీజేలు పెడుతున్నారని, దీని వలన ఇప్పటికే చాలా మంది మృతి చెందారన్నారు.

పోలీసుల అత్యుత్సాహం

● టెక్కలి 'అన్నదాత పోరు'లో ఉద్రిక్తత


టెక్కలిలో అన్నదాత పోరు ర్యాలీకు వెళ్లకుండా తిలక్‌ను నిర్బంధించిన పోలీసులు

టెక్కలి: యూరియా కోసం రైతులు ఎదుర్కొంటున్న కష్టాలపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ నేతృత్వంలో మంగళవారం టెక్కలిలో తలపెట్టిన అన్నదాత పోరు ఉద్రిక్తతకు దారి తీసింది. రైతుల కోసం చేస్తున్న నిరసన కార్యక్రమంలో పోలీసుల అత్యుత్సాహం ప్రదర్శించి ఎక్కడికక్కడే అక్రమంగా నిర్బంధాలు చేశారు. మరోవైపు నాయకులు నిరసన కార్యక్రమానికి రాకుండా హౌస్ అరెస్టులు చేశారు. టెక్కలిలో ప్రధాన జంక్షన్లలో పోలీసులు మోహరించి అన్నదాత పోరు ర్యాలీని అడ్డుకునే ప్రయత్నంలో పార్టీ కార్యకర్తలు, రైతులను బలవంతంగా అదుపులో తీసుకుని వాహనాల్లో ఇతర పోలీస్ స్టేషన్లకు తరలించారు. నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్‌ను వైఎస్సార్ జంక్షన్ సమీపంలో అడ్డుకునే ప్రయత్నం చేయడంతో ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఒకానొక దశలో డీఎస్పీ లక్ష్మణరావు,


వైఎస్సార్ జంక్షన్‌లో వాహనానికి అడ్డంగా బైఠాయించి నినాదాలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

సీఐలు విజయకుమార్, శ్రీనివాసరావుతో పాటు పెద్ద ఎత్తున పోలీసులు తిలక్‌ను చుట్టుముట్టి బలవంతంగా నిర్బంధించే ప్రయత్నం చేశారు. దీంతో ప్రతిఘటించడంతో పెనుగులాటలు చోటు చేసుకున్నాయి. పోలీసులంతా ఒక్కసారిగా మోహరించి తిలక్‌ను బలవంతంగా వాహనంలో తరలించడంతో, వైఎస్సార్‌సీపీ శ్రేణులు, రైతులంతా వైఎస్సార్ జంక్షన్ వద్ద పోలీస్ వాహనానికి అడ్డంగా బైఠాయించి పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. అనంతరం తిలక్‌ను టెక్కలి ఆర్డీవో కార్యాలయానికి తరలించారు. ఇది తెలుసుకున్న కార్యకర్తలు, రైతులంతా అక్కడకు చేరుకుని రైతులకు యూరియా ఇవ్వలేని వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. అనంతరం వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, పార్టీ పార్లమెంటరీ నియోజకవర్గ పరిశీలకుడు కుంభా రవిబాబు, మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి, టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్, టెక్కలి, సంతబొమ్మాళి జెడ్పీటీసీ సభ్యులు దువ్వాడ వాణి, పాల వసంతరెడ్డి, టెక్కలి ఎంపీపీ అట్ల సరోజనమ్మ, పార్టీ టెక్కలి మండలాధ్యక్షుడు హెచ్.వెంకటేశ్వరరావు, రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుగ్గు రామిరెడ్డి, నాయకులు సత్తారు సత్యం, అన్నెపు రామారావు, తమ్మన్నగారి కిరణ్, కె.అజయ్, కె.బాలకృష్ణ, కె.కృష్ణారావు, ఎన్.భీమారావు, వై.మన్మథరావు, బి.దివాకర్, పి.హేమలత, రాములమ్మ, చిన్ని జోగారావు, ఎం.నాగభూషణ్ తదితరులు టెక్కలి ఆర్డీవో ఎం.కృష్ణమూర్తికి వినతిపత్రం అందజేశారు.


పోలీసులు నిర్బంధించడంతో ప్రతిఘటిస్తున్న నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్, నాయకులు



టెక్కలి ఆర్డీఓ కార్యాలయం వద్ద నినాదాలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు, రైతులు

రైతులకు యూరియా ఇవ్వలేని చేతకాని ప్రభుత్వం

రైతులకు యూరియా ఇవ్వలేని చేతకాని ప్రభుత్వం రాష్ట్రంలో ఉంది. వ్యవసాయ శాఖా మంత్రితో పాటు అధికార యంత్రాంగం మొత్తం యూరియా స్టాకు ఉందని చెబుతున్నా రైతులకు ఎందుకు ఇవ్వడం లేదు. ఇటువంటి చేతకాని ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాలి.

–ధర్మాన కృష్ణదాస్,
వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు

చేతకాని మంత్రి రాజీనామా చేయాలి

రైతులకు యూరియా ఇవ్వలేని చేతకాని వ్యవసాయ శాఖ మంత్రి తక్షణమే రాజీనామా చేయాలి. సొంత నియోజకవర్గంలోనే రైతులకు న్యాయం చేయలేని మంత్రి రాష్ట్రంలో రైతులకు ఏం మేలు చేస్తారు. వ్యవసాయ శాఖ మంత్రికి అవగాహన లేకపోవడం వల్లనే రైతులకు యూరియా కష్టాలు వచ్చాయి.

– పేరాడ తిలక్,
వైఎస్సార్‌సీపీ టెక్కలి సమన్వయకర్త

ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారు

● మాజీమంత్రి సీదిరి అప్పలరాజు


పలాస ఆర్డీవో కార్యాలయం సిబ్బందికి వినతిపత్రం అందజేస్తున్న సీదిరి అప్పలరాజు, జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావు , ధర్మాన కృష్ణదాస్, కుంభా రవిబాబు తదితరులు

పలాస/వజ్రపుకొత్తూరు రూరల్: రైతులకు అండగా నిలుస్తూ యూరియా అడిగిన పాపానికి వైఎస్సార్‌సీపీ నాయకులను పోలీసులు నిర్బంధించి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు ధ్వజమెత్తారు. మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు మంగళవారం పలాసలో 'అన్నదాత పోరు' కార్యక్రమం నిర్వహించేందుకు వెళ్తుండగా అతని ఇంటి వద్ద పోలీసులు అప్పలరాజుతోపాటు నాయకులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం , పోలీసులు కలిసి నిర్బంధం చేసిందని కేవలం వైఎస్సార్‌సీపీ నాయకులనే కాదని, రైతులు, వారి ఆత్మగౌరవాన్ని, ప్రజల గొంతుకునని అన్నారు. ఎక్కడైతే ప్రజల గొంతు నొక్కబడుతుందో, ఎక్కడైతే ప్రజల హక్కులను కాలరాస్తారో అక్కడ ప్రభుత్వాలు కాలగర్భంలో కలిసిపోతాయన్నారు. ఇదే గతి రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వానికి పడుతోందని అన్నారు. తాము పార్టీ కార్యక్రమాలు చేయడం లేదని, కూటమి నాయకుల మాదిరి తాగితందనాలు ఆడుతూ రోడ్డుపైకి రావడం లేదని అన్నారు. నాలుగుసార్లు ముఖ్యమంత్రి అయిన చంద్రబాబుకు కనీసం రైతు బాధలు పట్టవా అని ప్రశ్నించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో గ్రామస్థాయిలో రైతు భరోసా కేంద్రాలు నిర్మించి అగ్రికల్చర్ సిబ్బందిని నియమించామని, విలువైన కియోస్కో, కంప్యూటర్, ఇంటర్ నెట్ సౌకరం, సాంకేతిక యంత్రాలను కల్పించామని.. వీటన్నింటినీ వినియోగించుకోలేని అసమర్థత పాలన చంద్రబాబు చేస్తున్నారంటూ మండిపడ్డారు. రైతులు అర్ధరాత్రి వేళలో కూడా ఎరువుల కోసం రోడ్డెక్కి కన్నీరు కార్చుతుంటే.. వచ్చే రబీ సీజన్‌కు రైతులందరికీ వెబ్‌ల్యాండ్ ఆధారంగా ఎరువులు ఇస్తామని చంద్రబాబు తీరిగ్గా చెప్పడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ కళింగ కుల విభాగ రాష్ట్ర అధ్యక్షుడు దుంపల రామారావు, మందస ఎంపీపీ డొక్కరి దానయ్య, పలాస, కాశీబుగ్గ పట్టణ కమిటీ అధ్యక్షుడు శిష్టి గోపి, పలాస మండల అధ్యక్షుడు దువ్వాడ రవి, వజ్రపుకొత్తూరు మండల అధ్యక్షుడు తిర్రి రాజారావు, పార్టీ నాయకులు ఉంగసాయి క్రిష్ణ, వైస్ చైర్మన్లు మీసాల సురేష్‌బాబు, బోర బుజ్జి, బమ్మిడి దుర్యోధన, పీఏసీఎస్ మాజీ అధ్యక్షులు దువ్వాడ మధుకేశ్వరరావు, మాజీ ఎంపీపీ బత్తిని హేమేశ్వరరావు, నాయకులు సుజాత పండా, కర్రి గోపాల్, గణపతి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు,నాయకులు, కార్యకర్తలు, రైతులు, అభిమానులు ఉన్నారు.

చంద్రబాబుకు రైతులంటే నిర్లక్ష్యం

పలాస/వజ్రపుకొత్తూరు రూరల్: ముఖ్యమంత్రి చంద్రబాబుకు రైతులంతే నిర్లక్ష్యమని వైఎస్సార్ సీపీ నాయకులు అన్నారు. పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పిలుపు మేరకు మంగళవారం పలాసలో అన్నదాత పోరు కార్యక్రమాన్ని పోలీసులు ఆంక్షల మధ్య నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు, ధర్మాన కృష్ణదాస్, మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు, జెడ్పీ చైర్మన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావు, పార్లమెంట్ పరిశీలికులు కుంభా రవిబాబు, రైతులతో కలిసి పలాస ఆర్డీవో కార్యాలయ సిబ్బందికి వినతి పత్రం అందించారు. యూరియా బ్లాక్ మార్కెంటింగ్ అరికట్టి రైతుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సీడాప్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ సాడి శ్యాంప్రసాద్‌రెడ్డి, క్రిస్టియన్ మైనారిటీ ప్రతినిధి ప్రత్తి అన్వేష్, తడక జోగారావు, పార్టీ కళింగ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు దుంపల రామారావు, నర్తు నరేంద్ర, పలాస ఎంపీపీ డొక్కరి దానయ్య, కౌన్సిలర్లు పాల్గొన్నారు.


యూరియా కావాలంటూ నినాదాలు చేస్తున్న నాయకులు,రైతులు



ప్రభుత్వం తీరుకి వ్యతిరేకంగా రైతులు, నాయకులు ర్యాలీ

రైతన్న నోట్లో మట్టికొట్టిన కూటమి ప్రభుత్వం


కవిటి: బల్లిపుట్టుగలో పోలీసుల తీరుకు నిరసనగా గేటు వద్ద బైటాయించిన చైర్‌పర్సన్ పిరియా విజయ, శ్రేణులు


కవిటి :ఎమ్మెల్సీ నర్తు రామారావును అడ్డుకున్న పోలీసులు

● జెడ్పీ చైర్‌పర్సన్ విజయ, ఎమ్మెల్సీ రామారావు

కవిటి: వరిసాగు చేస్తున్న రైతులకు కావాల్సిన ఎరువులు ఇవ్వకుండా వారినోట్లో కూటమి ప్రభుత్వం మట్టికొట్టిందని జెడ్పీ చైర్‌పర్సన్‌పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావు విమర్శించారు. రైతులకు మద్దతుగా వైఎస్సార్‌సీపీ మంగళవారం నిర్వహించిన అన్నదాత పోరు కార్యక్రమాన్ని ప్రభుత్వం బలవంతంగా అణగదొక్కిందన్నారు. పలాస డివిజన్ కేంద్రంలో రైతులకు మద్దతుగా శాంతియుత నిరసన తెలిపేందుకు వెవెళ్లేందుకు సిద్ధమైన చైర్‌పర్సన్ విజయను కవిటి మండలం బల్లిపుట్టుగలోని ఆమె నివాసంలో, ఎమ్మెల్సీ నర్తు రామారావును కొత్తపుట్టుగలోని ఆయన నివాసంలో, ఎంపీపీ కడియాల పద్మ, ప్రకాష్‌ను శిలగాంలో పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. ఒకదశలో ఇంటి వెనుక వైపు నుంచి బయటకు వచ్చి పలాస వెళ్లేందుకు సిద్ధపడిన చైర్‌పర్సన్ విజయను అవుట్‌గేట్‌కు పోలీసులు తాళం వేసి అడ్డుకున్నారు. దీంతో ఆమెతోపాటు అనుచరులు తీవ్ర అసహనం వ్యక్తం చేసి గేటు వద్దనే బైటాయించారు. కొత్తపుట్టుగలో శాంతియుతంగా రైతుల పక్షాన చేస్తున్న తమ పోరాటానికి సహకరించమని పోలీసులకు ఎమ్మెల్సీ రామారావు విజ్ఞప్తి చేసినప్పటికీ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తాము నడుచుకోకతప్పదని తిరస్కరించారు. ఎంపీపీ కడియాలపద్మ, ప్రకాష్, వైస్ ఎంపీపీలు పి.నేతాజీ, కె.గోపయ్య, వై.అశోక్, పి.శేఖర్, పి.నీలాచలం, జె.యుగంధర్, వజ్జ ప్రసాద్, కె.భీమసేన్, పి.వెంకటరావు, జి.రవిప్రధాన్, నర్తు అశోక్, నారాయణస్వామి, పి.లక్ష్మణరావు, పి.జయరావు, ఎం .నాగేశ్వరరావు పాల్గొన్నారు.

యూరియా టోకెన్ల కోసం రైతన్న పాట్లు


ఇచ్ఛాపురం: రైతులను శాంతింపచేస్తున్న పోలీసులు

ఇచ్ఛాపురం: మున్సిపాలిటీ పరిధి బెల్లుపడ రైతు సేవా కేంద్రం వద్ద రైతులు యూరియా టోకెన్ల కోసం మంగళవారం నిరీక్షించారు. ఉదయం తొమ్మిది గంటలకే చేరుకొని క్యూలైన్లో ఉన్నప్పటికీ చాలామందికి టోకెన్లు అందలేదు. ఎండలో గంటల తరబడి వేచి ఉన్న రైతులు విసిగిపోయి ఆందోళనకు దిగారు. ఈ విషయం తెలుసుకున్న తహసీల్దార్ ఎస్.వెంకటేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ ఎన్.రమేష్, వ్యవసాయశాఖ అధికారి అజయ్‌కుమార్‌లు పోలీసుల సహకారంతో అక్కడకు చేరుకొని రైతులతో మాట్లాడి వారికి సర్దిచెప్పే ప్రయత్నం చేసారు. అయినప్పటికీ అధికారులతో రైతులు వాగ్వాదానికి దిగారు. పోలీసులు రంగప్రవేశం చేసి రైతులను శాంతింపచేసి క్యూలైన్‌ని పాటించేలా చూశారు.

యూరియా అందజేయాలి

సోంపేట: ప్రభుత్వం యూరియా అందజేయాలని బేసిరామచంద్రాపురం రైతులు డిమాండ్ చేశారు. గ్రామంలోని రైతు సేవా కేంద్రం వద్ద రైతులు మంగళవారం యూరియా కోసం బారులు తీరారు.

11 నుంచి ఉపాధ్యాయుల నిరసన



హరిపురం పాఠశాల వద్ద కరపత్రాలను ప్రదర్శిస్తున్న ఏపీటీఎఫ్ ప్రతినిధులు

మందస: ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 11 నుంచి 17వ తేదీ వరకు నిరసన వారం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర కౌన్సిలర్ బల్ల సుభాష్‌బాబు తెలిపారు. నిరసన కార్యక్రమాలకు సంబంధించిన పోస్టర్లను మంగళవారం సంఘ నాయకులతో కలిసి విడుదల చేశారు. ఉపాధ్యాయుల పెండింగ్ డీఏలు, పీఆర్‌సీ కమిషన్ నియామకం, ఐఆర్ ప్రకటన, అన్ని మేనేజ్‌మెంట్ల సమస్యల పరిష్కారం కోసం చేపడుతున్న ఈ నిరసన కార్యక్రమంలో భాగంగా 11న నల్ల బ్యాడ్జీలతో విధులకు హాజరు, 12న మండలస్థాయి ప్రదర్శనలు, 13, 14వ తేదీల్లో ప్రజా ప్రతినిధులకు వినతి పత్రాల అందజేత, 15న పాతా తాలూకా కేంద్రాల్లో, 16న జిల్లా కేంద్రాల్లో నిరసనలు, 17న వాట్సప్, మెయిల్ ద్వారా సీఎస్, ముఖ్యమంత్రికి వినతులు పంపించే కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఏపీటీఎఫ్ మందస మండల శాఖ ఆధ్వర్యంలో హరిరం, అంబుగాం, లోహరిబంద, బహడపల్లి, బేతాలపురం, కుంటికోట, మహదేవపురం, కిల్లోయి, మందసలోని పాఠశాలలను పదర్శించి నిరసన కార్యక్రమ కరపత్రాలను పంచి పెట్టారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు గవ్వ భీమారావు, మండల అధ్యక్షులు ఎస్.కిరణ్‌కుమార్, పాపారావు, చంద్రశేఖర్, వైకుంఠవు, జగదీశ్వరరావు, డిల్లేశ్వరరావు ఉన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుల గృహ నిర్బంధం

ఎరువులు లభ్యంకాక రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారు. వరిపైరుకు సకాలంలో యూరియా వేయకపోతే పంటదిగుబడి తగ్గిపోతోందని గుబులు చెందుతున్నారు. అదును దాటిన తరువాత ఎరువు వేసిన ప్రయోజనం ఉండదంటున్నారు. ఈ నేపథ్యంలో రైతులకు మద్దతుగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ 'అన్నదాత పోరు'కు మంగళవారం పిలుపునిచ్చింది. నాయకులు, రైతులు నిరసన కార్యక్రమానికి వెళ్లేందుకు సిద్ధమవుతుండగా.. పోలీసులు అడుగడుగునా ఆంక్షలు విధించి అడుగు ముందుకు వేయనీయకుండా అడ్డుకున్నారు. తెల్లవారుజామునే నాయకుల ఇళ్లకు చేరుకొని బయటకు రానీయకుండా గృహ నిర్బంధం చేశారు.

సంతబొమ్మాళి: టెక్కలిలో నిర్వహించిన అన్నదాత పోరుకు వెళ్లకుండా సంతబొమ్మాళి మండలంలోని వైఎస్సార్‌సీపీ నాయకులను పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. అలాగే మరికొంతమంది నాయకులు, కార్యకర్తలను రోడ్డుపైన అడ్డుకున్నారు. వీరిలో కొందరు నాయకులు తప్పించుకొని టెక్కలిలో జరిగిన ర్యాలీలో పాల్గొని రైతు సమస్యలపై పోరాటం చేశారు. హౌస్ అరెస్టయిన వారిలో జెడ్పీటీసీ సభ్యుడు పాల వసంతరెడ్డి, ఎంపీపీ మేరుగు రాజేశ్వరి, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కెళ్లి జగన్నాయకులు, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు ఉన్నారు.

- **కంచిలి:** పలాస ఆర్డీవో కార్యాలయానికి బయలుదేరిన కంచిలి మండల వైఎస్సార్‌సీపీ నాయకులను పోలీసులు ఎక్కడికక్కడ అడ్డుకున్నారు. ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డిని తన నివాసం నుంచి వస్తుండగా మార్గమధ్యంలో అడ్డుకోగా.. జెడ్పీటీసీ సభ్యురాలు ఇప్పిలి లోలాక్షిని తన ఇంటి వద్దనే అడ్డుకున్నారు. మిగతా పార్టీ నేతలు కూడా నిరసన కార్యక్రమానికి వెళ్లకుండా ఎక్కడికక్కడ నిర్బంధించారు. చివరికి స్థానిక తహసీల్దార్ ఎన్.రమేష్‌కుమార్‌కు వినతి పత్రాన్ని పార్టీ నేతలు అందజేసి, యూరియా కొరతను అత్యవసరంగా తీర్చాల్సిందిగా కోరారు. ఎంపీపీతోపాటు మండల పార్టీ అధ్యక్షుడు వజ్జ మృత్యుంజయరావు, నాయకులు దుర్గాసి ధర్మారావు, పలికల జయరాం, బెందాళం శోభన్‌బాబు, మడ్డు వెంకటరావు, చంద్రయ్య, మడ్డు అభియాదవ్ తదితరులున్నారు.
- **ఇచ్ఛాపురం:** పలాసలో నిర్వహించిన అన్నదాత పోరు కార్యక్రమంలో మున్సిపాలిటీకి చెందిన నాయకులు పాల్గొనకుండా పోలీసులు గృహ నిర్బంధం చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి, వైఎస్సార్‌సీపీ జిల్లా మహిళా విభాగ అధ్యక్షురాలు, వైస్ చైర్‌పర్సన్–1 ఉలాల భారతీదివ్య, పట్టణ పార్టీ అధ్యక్షుడు ప్రకాశరావు పట్నాయక్‌తో పాటు పలువురు కౌన్సిలర్లు, నాయకులను నిర్బంధించారు.
- **నందిగాం:** టెక్కలిలో జరిగిన అన్నదాత పోరుకు వెళ్లేందుకు నందిగాం మండలం నుంచి వెళ్తున్న ఎంపీపీ నడుపూరు శ్రీరామమూర్తి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి యర్ర చక్రవర్తిని పోలీసులు గృహ నిర్బంధం చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. యూరియా అందించలేని ప్రభుత్వం అధికార మదంతో గృహ నిర్బంధం చేయడం విడ్డూరమని అన్నారు. వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు అధికారులతో రైతుల వాయిస్ లేకుండా చేయాలని చూస్తున్నాడు తప్ప రైతులకు అవసరమైన ఎరువులు అందజేయడంపై దృష్టిసారిస్తే మంచిదని హితవు పలికారు.
- **ఇచ్ఛాపురం రూరల్:** పలాసలో నిర్వహించిన 'అన్నదాత పోరు' నిరసన కార్యక్రమానికి వెళ్లేందుకు సిద్ధపడిన వైఎస్సార్‌సీపీ నాయకులను పోలీసులు ఇంటి వద్దనే నిర్బంధించారు. ఎంపీపీ బోర పుష్పను ఆమె స్వగ్రామం కె.శాసనాం, వైఎస్సార్ సీపీ రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి నర్తు నరేంద్రయాదవ్‌ను ఈదుపురంలో, మండల పార్టీ కన్వీనర్ పాతిర్ల రాజశేఖరరెడ్డిని తేలుకుంచిలో హౌస్ అరెస్టు చేశారు.
- **సోంపేట:** పలాస వెళ్లేందుకు బయలుదేరిన సోంపేట మండల వైఎస్సార్‌సీపీ నాయకులు, రైతులను పోలీసులు అడ్డుకున్నారు. సోంపేట ఎంపీపీ నిమ్మన దాస్‌ను సోంపేటలో హౌస్ అరెస్టు చేశారు. పోలీసుల కళ్లుకప్పి పలాసపురం సర్పంచ్ తడక జోగారావు పలాసలో జరిగిన అన్నదాత పోరు కార్యక్రమంలో పాల్గొన్నారు. కొర్లాంలో మండల పార్టీ అధ్యక్షుడు శిలగాన భాస్కరరావు, బుద్దాన శ్రీకృష్ణ , పాతిన శేషగిరి, గురాల శ్రీను, కర్రి సత్యం, తెప్పల ధర్మారావు, దున్న మాధవరావు, పలువురు నియోజకవర్గ నాయకులను సోంపేట, బారువ ఎస్సైలు అడ్డుకున్నారు.
- **వజ్రపుకొత్తూరు రూరల్:** మండలంలో పలువురు నాయకులను పోలీసులు నిర్బంధించారు. పల్లిసారధిలో జెడ్పీటీసీ సభ్యురాలు ఉప్పరపల్లి నీలవేణి, వైఎస్సార్ సీపీ నాయకులు ఉప్పరపల్లి ఉదయ్‌కుమార్, గోవిందపురంలో జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ పాలిన శ్రావణి, పార్టీ నాయకులు పాలిన శ్రీనివాసరావులను పోలీసులు గృహ నిర్బంధం చేశారు.

సంక్షిప్తంగా...

ఉత్సాహంగా క్రీడాకారుల ఎంపిక పోటీలు


కబడ్డీలో తలపడుతున్న విద్యార్థినులు

వజ్రపుకొత్తూరు రూరల్: నగరంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి అండర్ 14, 17 విభాగాల్లో కబడ్డీ, బ్యాడ్మింటన్, యోగా పోటీలు ఉత్సాహంగా జరిగాయి. 300 మంది క్రీడాకారులు పాల్గొనగా అందులో 68 మంది క్రీడాకారులు క్రీడల్లో ప్రతిభ కనబర్చి డివిజన్ స్థాయి క్రీడలకు ఎంపిక అయ్యారు. పోటీలను ఎంఈవో వెంకటరమణ ప్రారంభించగా.. జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ అధ్యక్షుడు పి.తవిటయ్య, రాష్ట్ర అథ్లెటిక్ టెక్నికల్ కమిటీ కన్వీనర్ కె.హరిబాబు, మండల స్పోర్ట్స్ కో ఆర్డినేటర్ పి.గజేంద్ర, నారాయణ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి.హేమారావు, శ్రీనివాస్ ఉన్నారు.

మానవసేవే ముక్తికి మార్గం

నందిగాం: మానవసేవే ముక్తికి మంచిమార్గమని ఉత్తర దత్త పీఠాధిపతి విజయానందతీర్థస్వామి అన్నారు. నందిగాం మండలం పెద్దతామరాపల్లి, కాపుతెంబూరు గ్రామాల్లో పల్లె పర్యటనలో భాగంగా మంగళవారం సందర్శించారు. ప్రతి ఒక్కరూ సేవ, సత్సంగాలు, భజనలు చేసి ఊరట చేకూర్చుకోవాలని సూచించారు. అలాగే ప్రతి ఒక్కరూ దైవ సంకీర్తన చేసి భక్తిమార్గంలో పయనించాలని, తద్వారా శాంతియుత జీవనం సాగించాలన్నారు. కార్యక్రమంలో నిర్విషయానందస్వామి, కె.నారాయణరావు, కొల్లి దీనబంధు పాల్గొన్నారు.

మెరిట్ సర్టిఫికెట్ల పంపిణీ

కంచిలి : మండల కేంద్రం కంచిలి ప్రాథమిక పాఠశాలకు చెందిన విద్యార్థులు ఇటీవల జరిగిన ఇండియన్ స్కూల్ ఆఫ్ టాలెంట సెర్చ్ ఎగ్జామినేషన్ ఒలింపియాడ్ పరీక్షల్లో ప్రతిభకనబర్చారు. వీరికి ఎంఈవోలు ఎస్.శివరాంప్రసాద్, కె.చిట్టిబాబు చేతులమీదుగా మంగళవారం మెరిట్ సర్టిఫికెట్ల పంపిణీ చేపట్టారు. 2024–25 విద్యా సంవత్సరంలో కంచిలి పాఠశాలలో జరిగిన ఒలింపియాడ్ పరీక్షల విజేతలను ఈ సందర్భంగా అభినందించారు. కంచిలి క్లస్టర్ స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ చాణిక్య, ప్రధానోపాధ్యాయుడు జగన్, సిబ్బంది జర్జాన భగవతిరావు, అన్నెపు శ్రీనివాసరావు, యారడి శంకరరావు, సంతోష్ పండా, గైడ్ టీచర్ నల్లాన రవి పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యల సాధనకు రణభేరి

కంచిలి: విద్యారంగ, ఆర్థిక సమస్యలపై ఈ నెల 15 నుంచి 19వ తేదీ వరకు జరిగే రణభేరి జాతను జయప్రదం చేయాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు లండ బాబూరావు కోరారు. కంచిలి మండల కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయం వద్ద మంగళవారం సాయంత్రం రణభేరి జాత పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షుడు మురళినాయక్, ప్రధాన కార్యదర్శి నల్లాన రవి, కోశాధికారి లక్ష్మణరావు, పూర్వ రాష్ట్ర కౌన్సిలర్ శమల్ల వెంకటరావు, జిల్లా కౌన్సిలర్ త్రినాథ్‌సాహు, జె.భగవతిరావు, పాలిన చిరంజీవులు, మోహనరావు, దివాకర్ పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
టెక్కలి 7093164422
పలాస / ఇచ్ఛాపురం 9010178979
Office mail : sklmadvt@gmail.com